కథా నిలయం
1397
శ్రీకాకుళం

నా ఇల్లు

"ఒరేయ్ అబ్బాయ్! నేనూ మీ నాన్నా మనూవెళ్ళి ఓ పదిరోజులుండి వస్తాంరా" నా తరఫున శ్రీమతి అంది మా పెద్దబ్బాయి వాసుతో.

"ఎక్కడికి? ఆ పల్లెటూరికా?!" వెటకారంగా అన్నాడు నవ్వుతూ వాసు.

మొఖం తిప్పేసుకున్నాను. కాని శ్రీమతి వూరుకోలేదు.

"అక్కడికేరా. మీ నాన్నకి మహాపట్నంలో బొత్తిగా వూపి రాట్టం లేదుట. ఓ వారం పదిరోజులక్కడ వుండి వస్తే బావుంటుందనీ...."

"నాన్న ఆరోగ్యం ఎలా వుందో తెలిసి కూడా నువ్వాయనకి వంత పాడితే ఎలాగమ్మా. ఆ పల్లెటూళ్లో ఆయనకి ట్రీట్ మెంటివ్వడానికి డాక్టరు కాదు కదా కాంపౌండరు కూడా దొరకడని నీకు తెలుసుగా. అయినా కాలక్షేపానికిక్కడ బోల్డన్ని బస్సు పార్కులూ సినిమాలూ సభలూ వుపన్యాసాలూ వున్నాయ్. అక్కడేమున్నాయ్ మట్టీ మశానం తప్ప?!"

"ఏమోరా! అవన్నీ మాకు తెలీవుగాని మన వాళ్ళంటూ వున్న పల్లెటూళ్ళో మనదంటూ వున్న ఇంట్లో వుంటే మీ నాన్నకి నాకూ కూడా ప్రాణం తెరిపిగా వుంటుందనుకో. ఇక్కడీ అద్దె కొంపల్లో ఈ వాతావరణంలో ఏదో ఇరుగ్గా వుంటుందిరా"

నిజం చెప్పొద్దూ మా ఇల్లంటే నాకెంతో ఇష్టమని శ్రీమతికి తెలుసు. నా ఇష్టమే ఆవిడిష్టం ఇప్పుడే కాదు పెళ్ళైనప్పట్నుంచీ అంతే.

"అదీ అలా చెప్పు. ఎలా అయితే లిక్కా లిక్కా మంటూ టీసీ నాటి ఓ పాడు పడిన కొంపకొన్నాదు కదూ దాని మీద దేర్ణం తిరిగుంటుంది. కదమ్మా?"

వాడి ఎత్తి పొడుపుకి చాలా బాధన్పించింది. వీడేకాదు రెండోవాడూ అంతే. వాళ్ళకి నేను కన్న తండ్రినే అయినా వాళ్ళు నా మాటెప్పుడూ వినరు. అందుకు బాధలేదు గాని ప్రతిదానికీ నన్నూ నా పనుల్నీ గేలి చేస్తూంటారు. అది తరాల అంతరాల ఫలితం కావొచ్చు. మా హోదాల తేడాల వల్లనూ అవ్వొచ్చు.

ఏంచేతంటే నేనో రిటైర్డ్ టీచర్ని. వాళ్ళు మంచి పొజిషన్లో వున్న వుద్యోగులు. వాళ్ళ ప్రారంభజీతమంత జీతం నేను రిటైరయ్యే ముందు కూడా తీసుకోలేదు. అంచేతే కాబోలు నాకంటే గొప్పగా ఫీలవుతూ 'నీకేం తెలుసోయ్ నువ్వో బ్రతకలేని బడి పంతులువి' అన్నట్టు చూస్తారు-ప్రవర్తిస్తారు!

వాడి మాటలకి ఒళ్ళు మండి అంది నా భార్య "పాడుదో బీడుదో ఏదో మాశక్తి కొద్దీ కొన్నాం. ఆయనకి వాళ్ళ నాన్న రెక్కలే ఇచ్చారు. మీ కాయన ఆ పాడుబడ్డ ఇల్లే ఇస్తారు. మీరు మీ పిల్లలకేం ఇస్తారో మేం చూశ్శేకపోయినా మీరు చూడరా? అప్పుడు మీకు తెలిసి రాదా!"

"ఈ మాత్రం దానికింత రాద్ధాంతం ఎందుకులే. అలాగే వెళ్ళండి అక్కడ పదిరోజులేం ఖర్మ యాజంగా అక్కడే వుండేగండి ఎవరొద్దన్నారూ?!" అనేసి విసురుగా వెళ్ళిపోయాడు వాసు.

వాడి మాటలకి నా మనస్సు చివుక్కుమన్నమాట నిజమే కాని మొత్తానికి ఒప్పుకున్నందుకు సంతోషం వేసిందనే చెప్పాలి.

ఇప్పుడేకాదు. ఆ ఇంటి వ్యవహారంలో మొదట్నుంచీ పిల్లలిద్దరూ

కూడా నాకు వ్యతిరేకంగానే వున్నారు. ఇల్లు కొనడమో లేక ఓ చిన్న ఇల్లు కట్టడమో చేద్దామని నేను అతికష్టం మీద సమకూర్చిన డబ్బు మీద ఇద్దరి దృష్టీ పడింది. ఎంతైనా నా ఎదిగిన కొడుకులు కదాని ఇల్లు కొనబో తున్నానని ఇద్దరికీ ఉత్తరం ముక్క రాస్తే తిరుగు టపాలో ఇద్దరూ వచ్చే శారు.

ఆ డబ్బుతో సైడ్ బిజినెస్ చేస్తాను నా కిమ్మంటూ పెద్దోడు కూర్చున్నాడు.

మేముండే టౌన్లో స్థలం చీప్‌గా దొరుకుతోంది. ముందు ముందు రేటు బాగా పెరుగుతుంది. మంచి లాభదాయకమంటూ కొంటానని పట్టు బట్టాడు చిన్నోడు.

ఇద్దరూ కలిసి ఇల్లు కొనడమంత పెర్రి పని ఇంకోటి లేదన్నారు. ఇంటి మీద పెట్టుబడి పెడితే ఆ విలువ అంత కంతకీ తగ్గిపోతుంది తప్ప ఏ రకంగానూ పెరగదనీ లాభసాటి కాదనీ లాభనష్టాలు బేరీజు వేసి మరీ చెప్పేరు. కాని నేను విన్లేదు.

ఫలితంగా గృహప్రవేశానికి పెద్దోడు రాలేదు. చిన్నోడు వచ్చేడు గాని సత్యన్నారాయణస్వామి వ్రతం చేద్దాం రారా అంటే రాను పొమ్మ న్నాడు. వీధి అరుగుమీద కూర్చున్న వూరివాళ్ళతో ఇల్లు కొని నేనెంత పొరబాటు చేశానో అదెంత నష్టకరమో వివరిస్తూ కూర్చున్నాడు!

అయినా నేను బాధపళ్ళేదు. ఎందుచేతంటే 'నా వాళ్ళు' అనుకోవ డంలో ఎంత తృప్తీ ఆనందం వున్నాయో, 'నా ఇల్లు' అనుకోవడంలోనూ అంతే ఆనందం వుంది.

ఇది ఇరవై ఏళ్ళనాటిమాట. అప్పుడు మా పిల్లలిద్దరూ బాగా చిన్న వాళ్ళే. నేనో చిన్న టౌన్లో పని చేస్తున్నాను. మాతోబాటు మా అమ్మగారు కూడా వుండేవారు. ఆవిడప్పటికే అరవై ఏళ్ళ ముసలావిడ. పైగా ఒకటే సుస్తీ.

సాధారణంగా టౌన్లో వుండే ప్రతి ఉద్యోగస్తుల్లానే మేమూ ఓ అద్దె కొంపలో వుండే వాళ్ళం. అదీ కూడా నా జీతాన్ని లెక్కలోకి తీసుకుని కుదుర్చుకోవడం వల్ల ఓ రెండు గదులూ వంటకో ప్రక్కన షెడ్డూ మాత్రం వున్న పోర్షన్లో వుండే వాళ్ళం.

మా అమ్మ రోగిష్ఠి అని చెప్పేనుగా. నిజానికా ఒక్క మాటా చాలదు కూడానూ. ఆవిడ మంచం మీంచి లేవలేకుండా వుండేది. మలం మూత్రం అన్నీ మంచం మీదే. అంచేత ఆవిడకో గది కేటాయించేశాం. అయినా ఆ వాసననీ అదీ భరించడం చాలా కష్టమయ్యేది. తలచుకుంటే ఇప్పటికీ కంపరం పుట్టడమే గాక పగవాళ్లక్కూడా అలాంటి స్థితి రాకూడదన్పిస్తుంది.

ఏమైనా మాకు తప్పదు గనుక పక్క పోర్షన్ల వాళ్ళూ ఇంటి గల వాళ్ళూ ఎంత మొఖం మీదే విసుక్కున్నా సణుక్కున్నా అన్నీ మౌనంగా తలొంచి భరించే వాళ్లం !

ఇక్కడ మా ఆవిడ గురించో ముక్క చెప్పడం చాలా అవసరం.

మా అమ్మకింత అనారోగ్యంగా వున్నా మా అక్క ఎక్కువగా చూడట్టానికైనా వచ్చేది కాదు. వచ్చినప్పుడైనా ముళ్లమీద కూర్చునట్టుండేది. మొఖం చూపించి మొక్కుబడి తీర్చుకున్నట్లు వెళ్లిపోయేది తప్ప ఎన్నడూ మా అమ్మగారి పక్క బట్ట మార్చి ఎరగదు. కానీ ఆ వచ్చిన ప్రతిసారీ మా అమ్మ దగ్గర చిన్నం ఎత్తు బంగారం లేదని బాధపడేది!

పాపం మా ఆవిడే అన్నీ చేసేది. చిన్నపిల్లకి చేసినట్టు అన్నీ ఎత్తిపోసేది. స్నానం చేయించి బట్ట కట్టేది. ఇప్పుడే లోకాన వుందో గాని పోయే ముందు మా అమ్మ మా ఆవిడ చేతులు పట్టుకుని "నేను ఓ కూతుర్ని కన్నాను కాని అది నా కూతురు కాదమ్మాయ్. నువ్వే నా కూతురువి. నీ కేమైనా ఇవ్వ పోదామంటే కాసు బంగారం కూడా లేదు

ఒంటి మీద!" అని బాధపడింది. మా ఆవిడ చేసిన సేవకి ఆ ఒక్క కితాబు చాలు.

ఒక రోజున మా అమ్మగారి పరిస్థితి మరీ క్షీణించింది. పోయే ప్రాణం వచ్చే ప్రాణంలా వుంది. ఎగశ్వాసల్లో కొచ్చేసింది. డాక్టరుకూడా ఆ రాత్రి గడిస్తే గొప్ప అన్నాడు.

మరి వార్తెలా తెలిసిందో ఏమో మా ఇంటిగలా వచ్చి ఆవిడ్ని బయట పెట్టేయండి లేకపోతే ఇల్లు ఖాళీ చేసెయ్యండంటూ పీకల మీద కూర్చుంది. ఇప్పుటింత అర్థాంతరంగా ఖాళీ చెయ్యమంటే ఎలాగని బ్రతిమాలాం.

పోనీ ఆవిడ్ని బయట పెట్టేయండి. ఇంట్లో చచ్చిపోతే అరిష్టమంది. పైగా మళ్లీ ఇంట్లోకి అద్దెకి వుండటానికి జరుస్తారని పట్టుబట్టింది.

ఇక తప్పేదేముంది ? అది ఎంత అమానుష మన్పించినా మరో మార్గాంతరం లేక మా ఇంటి ముందు రోడ్డు పక్కన రెండు మూడు తాటి ఆకుల్తోనూ చిరిగిన దుప్పట్లతోనూ చిన్న గుడారం వేసి అందులో పడుకోబెట్టాం. వెంటనే పోయి వుంటే బాగానే వుండేది. కాని అక్కడే రోడ్డు ప్రక్కనే మూడు రోజులపాటు తీసుకుని తీసుకుని చనిపోయింది!

మా అమ్మ కళ్ళల్లోం చప్పుడు మౌనంగా వరదై పారిన కన్నీళు గుర్తు కొస్తే ఇప్పటికీ అన్పిస్తూంటుంది—స్వంత ఇల్లు లేని బ్రతుకూ ఒక బ్రతుకేనా అని !

అవును మరి — మాకు అప్పుడే గనుక ఏ గుడిసో వుండి వుంటే ఎంతో ఇదిగా చూసి సేవ చేసిన మేం అంతిమ క్షణాల్లో ఆవిడ్నలా రోడ్డు పక్క కీడ్చెయ్యాల్సిన దుర్గతి పట్టేది కాదు. అందుకే అన్పిస్తుంటుంది కనీసం వుండటానికి కాకపోయినా చావడానికైనా స్వంతానికో ఇల్లు వుండాలని !

అంచేత ఒక రకంగా మంకు పట్టుదలతోనే స్వంత ఇల్లు ఏర్పరచుకోవడమే నా జీవితధ్యేయంగా శ్రమించి కృషి చేసి కూడ బెట్టి ఇల్లు

కొన్నాను. అవును మా కోసమే కొన్నాను. నేను పడ్డ యమబాధ రేపు మా పిల్లలు మా గురించి పడకూడదనే ముందు చూపుతోనే కొన్నాను.

కాని వాళ్ళు నన్నపార్థం చేసుకున్నారు అలా అని నే నెందు కంత పట్టుదలగా వున్నానో అప్పుడూ ఇప్పుడూ కూడా వాళ్ళతో చెప్పలేదు- చెప్పలేను కూడా.

ఎంచేతంటే నే నెంత మేష్టర్నైనా ఆ విషయం గురించి వాళ్ళకి వివరించి చెప్పగల మాటలు నా దగ్గర లేవనుకుంటాను. ఇవాళగాక పోయినా రేపైనా అద్దె కొంపల్లోని అగచాట్లూ స్వంత ఇంటిలోని సౌలభ్యం వాళ్ళకు తెలీక పోతుందా అని ఆశ!

మొత్తాని కేమైతేనేం పల్లెటూరు వెళ్ళడానికీ అక్కడి మా ఇంట్లో కొన్నాళ్ళుండి రావడానికీ పెద్దబ్బాయి ఒప్పుకున్నాడు. గనుక ఇక ఆట్టే ఆలస్యం చెయ్యకుండా మా ఆవిడా నేను ప్రయాణమయ్యాం.

మీ ఆరోగ్యం జాగ్రత్త-మందులవీ వాడుతూండంటూ పదే పదే హెచ్చరించాడు వాడు మమ్మల్ని రైలెక్కిస్తూ.

వాడి హెచ్చరికకి కారణం లేకపోలేదు. మరేనాటి పాపమో ప్రారబ్ధమో గాని ఒళ్ళంతా బాగా నీరు పట్టేసింది. గుండెకాయలో కూడా. దానికి తోడు నాకు తరచూ చలిజ్వరం వస్తూంటుంది. పైగా పశ్చిమాద్రికి చేరిన వయస్సాయె! ఇక నా ఆరోగ్యం గురించి చెప్పాల్సిందేముంది?

యింతవరకూ పట్నంలో ఆ ఇరుకు ఇళ్ళల్లో కుంచించుకు పోయిన మనుష్యుల మధ్య ప్రాణంలేని గాలిపీలుస్తూ కొంపలేవో మునుగుకు పోతున్నట్టు హడావిడిగా పరుగెత్తే మోటారు వాహనాల ధ్వనులు భరిస్తూండటం అలవాటైన మాకు పచ్చని చేలూ పారే ఏరూ నవ్వే చెట్లూ నోరారా పలకరించి మంచీ చెడ్డా పరామర్శించే మనుష్యులూ పల్లెసజీవ వాతావరణమూ అదీ మాకెంతో హాయినీ అహ్లాదాన్నీ కలిగించింది.

ఊపిరి సలపని లోకం నుండి సువిశాల ప్రదేశంలో కొచ్చినట్లుగా వుంది. పంజరం నుండి తప్పించుకుని దిగంతాల కెగిరిన పక్షి హృదయంలా వుంది.

అసలు నేను రిటైరవ్వగానే మేమిద్దరం వచ్చి ఇక్కడే వుండి పోదామనుకున్నాంగాని మా పిల్లలు ఒప్పుకోలేదు. ఒక్కొక్కరి దగ్గరా ఆరేసి నెలలు చొప్పున వుండమంటూ పట్టుదట్టడంతో ఒప్పుకోక తప్పలేదు. అలా అని ఇంటికి తాళం వేసి వెళ్ళి పోవడం ఇష్టంలేక ఇంట్లో దీపం పెట్టి యింటిని జాగ్రత్తగా చూస్తే చాలని ఓ మాస్టారికి నామినల్ రెంట్ కి అద్దెకిచ్చాం. ఆయనకి మధ్య ట్రాన్స్ఫర్ అవడంతో ఖాళీ చేసేశాడు. అప్పట్నుంచి మళ్ళీ ఇంకొకళ్ళ కివ్వడం పడలేదు. మేం ఇలా ప్రయాణం పెట్టుకోవడానికి యిల్లెలా వుందో అన్నదీ ఓ ముఖ్యకారణమే.

ఏమైనా యిల్లు బాగానే వుంది. వెళ్ళిపోయిన మాస్టారుకి పిల్లల్లేక పోవడంవల్ల కాబోలు అంతా శుభ్రంగానే వుంది. వాళ్లు ఖాళీచేసి రెండు నెలలైనందున యింటి నిండా దుమ్మూ బూజూ పేరుకు న్నాయి. ఒకటి రెండు గబ్బిలాలు కూడా తిరుగుతున్నాయి.

వచ్చిన రెండ్రోజులకే అంతా దులిపించి అలికించి ముగ్గులు పెట్టించాం. యిప్పుడిల్లు అద్దంలా తళతళ లాడుతోంది. కాని గోడలు మాత్రం కొంత రంగు మార్చుకున్నాయి. ఎప్పుడో గృహప్రవేశానికి హడావిడిగా వేయించిన వెల్ల తప్ప మళ్ళీ యింతవరకూ యింత సున్నం గోడ మొఖాన కొట్టిన పాపాన పోలేగా అసలూ!

ఆ మాటే అన్నాను శ్రీమతితో-" చెరో పాతికా పంపమనిరాస్తాను. వెల్లవేయించెయ్యొచ్చు. పన్లో పని పెంకు కూడా నేయించేస్తే బాగానేవుడ్ను గానీ...."

"అబ్బాయిలు కోప్పడతా రేమో నండీ"

నేను మాట్లాడలేదు. ఎంచేతంటే వాళ్లు కోప్పడటమే కాదు కసురు కుంటారు కూడానూ.

కానీ యింట్లో నాలాంటి పేషెంట్ వున్నప్పుడు ఏ క్షణాన్నైనా "ఫాదర్ సీరియస్-స్టార్ట్ యిమీడియట్లీ" అని టెలిగ్రాం వెళ్ళొచ్చు. వాళ్ళొచ్చేసరికీ గుప్పెడు ప్రాణమూ అనంత వాయువుల్లో కలిసిపోనూ వచ్చు. అప్పుడిహ త్వరగా అంత్యక్రియలు జరిపించెయ్యడం మినహా గత్యంతరం వుండదు.

ఆ కర్మకాండంతా యిక్కడే జరిపాల్సొస్తుంది గనుక చిన్న కార్యా నిగ్గాక పోయినా పెద్ద కార్యానికైనా యిల్లు బాగు చేయించక తప్పదు. అప్పటి కప్పుడు దానికూ్కడా డబ్బు సర్దుకోవడం త్వరగా పనులు పూర్తి చేయించడం వాళ్ళకి సాధ్యమయ్యేపని కాదు. అలా అని బంధువులు పది మందీ వస్తారు గనుక యింటి నలా వదిలెయ్యనూ లేరు.

అంచేత ఆ పనులేవో యిప్పుడే కానిచ్చేస్తే వాళ్ళకేం యిబ్బంది వుండదని నా తపన!

ఏమైనా రాయడానికే నిశ్చయించుకుని డబ్బు పంపమంటూ వుత్త రాలు రాశాను పిల్లలిద్దరికీ.

"వయస్సు మీరే కొద్దీ చాదస్తం పెరిగి పోతోంది" అని చిన్నోడూ, "పోతూ పోతూ ఆ యింటిని కూడా పట్టుకుపోయేట్టున్నారు చూస్తోంటే" అని పెద్దబ్బాయీ సన్నగా మందలిస్తూనే డబ్బు పంపారు.

నవ్వుకున్నాను. యివాళ గాకపోయినా రేపైనా వాళ్ళకి నేనెందుకు చేశానో తెలీక పోతుందా!

ఓ నెలరోజులు గిర్రున తిరిగి పోయాయ్. బంధువుల్తో స్నేహి తుల్తో పరిచయస్తుల్తో కలిసి కాలం వెళ్ళబుచ్చుతోంటే ఏదో తెలీని వుత్సాహం కలుగుతోంది. మరేదో తృప్తి లభిస్తోంది.

రోజూ సాయం సంధ్యావేళ పిరుపేపో మామిడి తోటల్లోకో షికారు కెళుతుండేవాణ్ణి కూడా. ఇక మా ఆవిడ సంగతి చెప్పేదేముంది. ఇరుగమ్మా పొరుగమ్మల్తో కలిసి ఒకటే పోచికోలు కబుర్లు రాత్రి పగలూ కూడా.

మరి గాలి మార్పు వల్లనో లేకపోతే నా రోగం తీరే అంతేనో తెలీదుకాని హఠాత్తుగా ఓ రోజున నన్ను మంచాన పడేసింది. ఆ పడె య్యటం పడెయ్యటం టైఫాయిడ్‌లోకి మార్చి గాని వదల్లేదు.

పిల్లలకి ఉత్తరాలు రాయమని మా ఆవిడ పోరసాగింది. రాస్తాన్లే అంటూ చాలా రోజులు నాన్చాను. ఈ కాసిని ప్రాణాలూ పోయేక వాళ్ళెలాగూ రాక తప్పదు. మళ్ళీ ఇంతలోనే ఎంతో దూరానవున్న వాళ్ళని అవస్థ పెట్టడం ఎందుకూ అని వూరుకున్నామగాని పరిస్థితి విషమిస్తోందని నాకూ తెలిసిపోతోంది.

ఈ ముసలితనంలో వద్దెనిమిది లంఖణాలు చేసి ఇంకా ప్రాణాల్తో వున్నానూ అంటే ఆశ్చర్యకరమే మరి. ఇప్పుడన్నాకు కూర్చోగలశక్తి కూడాలేదు. గ్లూకోజూ పళ్ళ రసాలూ అవీ ఎక్కడో వ్రేళ్లని పట్టుకుని వ్రేలాడుతోన్న ప్రాణాన్ని కాపాడుతున్నాయనుకుంటాను. అసలే ఒళ్ళంతా నీరు పట్టిందేమో నా పరిస్థితి మరీ అందోళనకరంగా వుంది. బహుశా నా ఆయుష్షింక రోజుల్లోనే వుందేమో!

అందుకే పిల్లలిద్దరికీ నాకు ఒంట్లో బావుండలేదనీ శలవు దొరికితే ఓసారి వచ్చిచూసి వెళ్ళమనీ వుత్తరాలు రాయించాను.

ఏ క్షణంలో వుత్తరం రాయించానో గాని అప్పట్నుంచీ నా చూపులు వీధి గుమ్మానికి అంటుకుపోయాయి. వాళ్ళని కడసారిగా చూడకుండానే పోతానేమోనని ఒకటే బెంగగా వుంది.

ఇక నా శ్రీమతి వంక చూస్తే చాలు దుఃఖం వెల్లువలా పొంగి వస్తోంది.

ఒకటా రెండా నలభై ఏళ్ళు ఆత్మీయ స్నేహితుల్లా కలిసివున్నాం. కష్టసుఖాల్ని కలబోసి పంచుకున్నాం. మంచి వచ్చినా చెడు జరిగినా పొంగినా క్రుంగినా అన్నీ కలిసే అనుభవించాం. అలాటిదిప్పుడు తనని ఒంటరిగా వదిలేసి నా మానాన నేను వెళ్ళిపోతున్నాను!

ఆ మాట తలచుకుంటే చాలు గుండెల్ని వుక్కు హస్తాలతో పిండే స్తున్నంత బాధ! దానికి తోడు ముత్తైదువగా పోవాలని పదే పదే అంటూండేది పిచ్చిది!

ఆఖరికి దేవుడికి మొక్కినా రెండే రెండు వరాలు కోరేది. ఒకటి నేనూ పిల్లలూ క్షేమంగా వుండాలనీ, రెండు తను ముత్తైదువగా తనువు చాలించాలనీను!

అలాటిది....రేపు తనని పిల్లలూ కోడళ్లూ ఎలా చూస్తారో ఏమో!

నా కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. తుడుచుకోడానికి చేతులు లేవ టం లేదు. అది గమనించిన శ్రీమతి నా కళ్ళు తుడిచి బావురుమంది.

ఆమెని ఓదార్చగల శక్తి ఆ దుఃఖానికి ఆనకట్ట వెయ్యగల స్థైర్యమూ నా కిప్పుడు కొంచెం కూడా లేవు !

నేను భయపడుతున్నట్టుగానే అంతిమ క్షణాలు చేరువయ్యాయ్. అందుకు ప్రత్యక్ష నిదర్శనం నా అసహాయ స్థితే. మాట పడిపోయింది. ఊపిరి పీల్చుకోవడం కష్టంగా వుంది. శరీరంగాలేవీ నా స్వాధీనంలో వున్నట్టుగా లేవు. నీటిలో పడ్డ ఎలుకలా కొట్టుకుంటున్నాను....

కాని పిల్లలు.... పిల్లలింకా రా....లే....దు....!

"పెలిగ్రాం ఇవ్వండి. ఇంకో రోజు గడిస్తే అదృష్టమే" డాక్టరు అంటున్నాడు.

శ్రీమతి ఘొల్లుమంది. ఎవరో ఎవర్నో పట్నం పంపారు. పెలి గ్రాములివ్వడానికి.

వాళ్ల తో సంబంధం లేనట్టు కట్టెలా కదలక మెదలక పలుకక్క పలుకరించలేక కడకు కళ్ళతొనైనా సైగ చెయ్యలేక శవంలా పడి వున్నాను.

మెల్లగా నా పరిస్థితి క్షీణించిపోతోంది. నేను పుట్టింది లగాయితు కొట్టుకుని కొట్టుకుని అలసి పోయిందేమో తాపీగా వినుగ్గా అసహనంగా కొట్టుకుంటోంది గుండె!

నేను అనుమానిస్తూ వచ్చినట్టు ఏ పిల్లద్గగరుండగానో పోకుండా నేను కొన్న నా ఇంట్లో ఆఖరి శ్వాస వదలడం నాకు తృప్తిగానే వున్నా పిల్లల్ని చూడకుండానే పోతానేమోనని తీరని వ్యథగా ఆందోళనగా వుంది!

"వచ్చేశారు" ఎవరో అరిచారు.

నాకు చాలా ఆనందం వేసింది. ఉత్సాహం పురకలేసింది. నర నరంలోనూ మిగిలివున్న శక్తినంతా పోగుజేసుకుని చూశాను అతి కష్టం మీద.

పిల్లలూ వారి భార్యా బిడ్డలూ!

మా అబ్బాయిలిద్దరూ దాదాపు ఏడుస్తున్నంత పని చేస్తూ వచ్చి నా మంచం మీద కూర్చుని నా చేతుల్ని తమ చేతుల్లోకి తీసుకుని "ఎలా వుంది నాన్నా ?!" అన్నారు ఆందోళనగా.

అప్రయత్నంగా నా కళ్ళు చెమర్చాయ్. నా హృదయం ఆర్ద్రి మయ్యింది. కనీసం వీళ్లకోసమైనా మరి కొన్ని రోజుల పాటైనా బ్రతికితే బావుణ్ణనిపించింది. కాని నా గడువై పోయింది! కనీసం ఓదార్చడానికి కూడా వీల్లేకుండా నోరుపడిపోయింది. ఇంతకంటే నరకం ఏముంటుంది ఎవరికైనా ?

వాళ్ళేదేదో మాట్లాడుకుంటున్నారు. డాక్టరు గురించీ, అతడు చేసిన వైద్యం గురించీ, నేను మంచం పట్టినప్పట్నుంచీ జరిగిన సంఘటనల గురించీనూ.

నాకూ ఓ రెండు ముక్కలు చెప్పాలనుంది. ఏ దేవుడైనా కరుణించి రెండే రెండు నిమిషాలసేపు మాటిస్తే "మీ అమ్మని జాగ్రత్తగా చూసుకోండ్రా—ఈ ఇంటిని అమ్మేయ్యకండ్రా" అని చెప్పాలని ఎంతో ఆరాటంగా వుంది. కాని వరమివ్వడానికి ఏ దేవుడూ నాకన్పించేంత దూరంలో లేడు!

ఎడతెగని ఆలోచనల వల్లనో ఆవేదన వల్లనో ఏమో గాని విపరీతమైన ఆయాసంగా వుంది. ఊపిరి అందటం లేదు. రొమ్ము ఎగిసెగిసి పడుతోంది....!

"దీపం ఆరే ముందు వెలిగే వెలుగే అది. స్పష్టంగా కన్పించడం లేదూ! మంచం మీంచి దించేస్తే సరి" ఎవరో అన్నారు.

ఆడవాళ్ళు ఘొల్లుమన్నారు.

ఏదేదో అనుకుని నన్ను మంచం మీంచి దించి చాప మీద పడుకోబెట్టారు.

గుండె లెందుకో మూలిగాయ్. పోనీలే అన్పించింది. పోతూ పోతూ ఈ పట్టింపు లేమిటన్పించింది. మొత్తానికి ఇంట్లోనే—నా స్వంత ఇంట్లోనే వూపిరి విడుస్తున్నందుకు తృప్తిగా అన్పించింది. మా అమ్మ అంతిమ క్షణాల్లో రోడ్డు ప్రక్కన దిక్కులేని దాన్లా అనుభవించిన నరక యాతనతో పోలిస్తే నేను చాలా చాలా అదృష్టవంతుడ్నన్పించింది.

ఆ వూహ ఎంతో వూరట మరెంతో సంతోషం కలిగిస్తోంటే కడసారిగా ఇంటినోసారి చూస్తే బావుండునని గుండె కొట్టుమిట్టాడుతోంది. కాని రెప్పలు.... అదేవిటి బరువుగా....అబ్బా ఇన్నాళ్ళూ ఇంత బరువైన

రెప్పలెన్నెలా భరించాను ? ఏమిటో ఊపిరి అబ్బా అబ్బా ఊపిరందటం లేదు ...గుండెల మీదెవరో ఎక్కి కూర్చున్నట్టు బరువుగా.... నవరంధ్రాలన్నీ ఒక్కొక్కటీ మూసేస్తున్నట్లుగా....

కాని.... ఎక్కడా యముని మహిషపు లోహపు గంటల సవ్వడులు విన్పించవేం ?

"ఒళ్లు చల్లబడిపోయిందిరా" ఎవరో అన్న మాటలు గుసగుసలుగా చెవిలో పడ్డాయ్.

"తులసిరసం అందుకోండి...." ఇంకెవరో అంటున్నారు ఆదుర్దాగా.

"ఏమీ అనుకోనంటే ఓ మాటరా అబ్బాయ్. ఇప్పుడు ఇంట్లో ప్రాణం పోతే తిథి మంచిది కాదు గనుక కొన్నాళ్ళు ఇంటిని మైల పెట్టాల్సొంటుంది. అందుకని బయట దొడ్లో పడుకోబెడితే....ఇంక ప్రాణం క్షణాలమీదే వుంది మరి...."

ఒరేయ్! నన్ను బయటికీడ్చెయ్యమంటున్నావుట్రా ? తాడు కట్టి ఈడ్చి పారెయ్యడానికి నేను!కుక్కననుకున్నావుట్రా ? ఇది నా ఇల్లురా. నా కష్టార్జితంతో కొన్నానురా. నా ఇంట్లో చచ్చే హక్కు కూడా నాకు లేదుట్రా ? నీ మైలా నీ పీడా పాడుగాను! అబ్బా....

అంత మాటన్న ఆ మహానుభావుడ్నోసారి చూస్తే బావుణ్ణు కాని రెప్పలు లేవడం లేదు. పోనీలే పోతూ పోతూ ఆ పాపిష్టివాడ్ని చూడ్డం ఎందుకూ ?!

ఇదేవిటి నిజంగానే నన్ను బయటికి తీసుకుపోతున్నారు ? నన్ను బయటి కీడ్చేస్తున్నాదెవడ్రా? ఒరేయ్! ఒరేయ్! ఎవరూ నా గోల విన్పించుకోరేంరా. నా ఇంట్లోంచి నన్ను ఈడ్చేస్తూ వంగనాచి ఏడ్పులేడుస్తూ రెండు ఖరా దొంగ నా కొడుకుల్లారా....!

దేవుడూ! నన్ను త్వరగా తీసుకుపోవయ్యా. నాఇంట్లోంచి నన్ను బయటి కీడ్చేశాక.... నేను బ్రతికుండగానే నా కింట్లో స్థానం లేకుండా చేశాక ఇక నేను ఒక్క క్షణం కూడా బ్రతకక్కూడదు గాక కూడదు....

అదిగో ఏదో అంటున్నారు. నోటిని తెరవజూస్తున్నారు....

తులసి రసం పోస్తారా ? వద్దురా పాపాత్ములారా. నాకేం వద్దు. మిమ్మల్ని చూడ్డమే మహా పాపం రా. పోతాను. మరో 'ఇల్లు'ని వెదుక్కుంటూ మరో లోకం వెళ్ళిపోతాను — వూహూ తాగను గాక తాగను... కాని శ్రీమతి పోస్తున్నట్టుంది రసం....అయినా సరే తాగను. నన్నుఈడ్చి పారేస్తోంటే ఏమంది గనుక ?! బ్రతికున్నన్నాళ్ళే ప్రేమలూ విలువలూ అభిమానాలూ ! చచ్చేక.... కానీ నేనింకా చావలేదే ! బహుశా చావబోతున్నాననేమో చచ్చిపోయినట్లు చూస్తున్నారు!

అబ్బా! ఎవర్రా గొంతు పిసుకుతోందీ ? నా గుండెల మీద వుక్కు పాదాలతో తొక్కుతోందెవర్రా ? అబ్బా-అమ్మా- నా ప్రతి అణువూ నా స్వాధీనం తప్పి....అమ్మా అనుకోవడానికి కూడా శక్తి లేదు.... ఇంక శక్తి ఎందుకులే. వాళ్ళ దృష్టిలో నా బతుక్కి అర్థం లేదు. నేనిప్పుడు మృత్యుగాఢ పరిష్వంగం కోసం ఎదురు చూడాలి. ఎలాగూ ఇన్నేళ్ళు కలవరించిన ఇంటినుంచి బయటి కీడ్చేశారు. ఇక మిగిలిన ఈ ఇల్లునీ ఈ లోకాన్నీ కూడా విడిచి కొన్ని క్షణాల్లో వెళ్లిపోతున్నందుకు సంతోషించాలి. అంతేనా ?!

—o—

(విపుల అక్టోబరు'80)